కుంపటిలో కుసుమం

"ఏమిటోయ్ అహమద్! ఈ వేళ ఎంతకూ బండి స్పీడ్ అందుకోడం లేదే! అవతల నాకు బోలెడన్ని పనులు వున్నాయి" అన్నాడు వెనుకసీటుకు చేరగిలబడి సిగరెట్టు కాల్చుకుంటున్న వజ్రపాణి.

"ఎక్కడో మిషన్ కొంచెం చెడిపోయినట్టుందండీ! ఐనా యింకెంత దూరం, దరిదాపుకు వచ్చేశాం!" అన్నాడు డ్రయివర్.

వజ్రపాణి తల కొంచెం పైకెత్తి తలుపు కడ్డంగా వున్న గ్లాసులోనుంచి పరిసరాల్ని పరికించాడు. కారు చెరువుకట్ట మీద పరుగిడుతోంది. బాలభానుడి స్వర్ణ కాంతుల్లో ఆ వైపున కొండకోనలు, ఈ వైపున పైరుపచ్చలు మధ్య నిండిన చెరువు మెరిసిపోతూ శోభాయమానంగా కన్పిస్తున్నాయి.

చెరువులో అక్కడక్కడా అల్లి తామరపువ్వులు విరిసి నవ్వు తున్నాయి. తన మనసులాగే ప్రకృతి సైతం ఆనందంలో తృళ్ళి పడుతున్నందుకు వజ్రపాణికి కలిగిన తృప్తి, అతడిచేత సన్నగా ఒక ఈలపాట పాడించింది.

పాట పాడుకుంటూనే వజ్రపాణి ఆలోచనలోపడ్డాడు. ప్రసన్న పుట్టినరోజు పండుగకి వాతావరణం చాలా బాగా అమరింది. ఈ పాటికి వంటలు కూడా ప్రారంభమై వుంటాయి. ఇక తను వెళ్ళడమూ, తోటలో కుర్చీలు అవీ వేయించడమే తరువాయి. మధ్యాహ్నం దాటిందంటే అతిథులొక్కొక్కరే దిగబడతారు. వాళ్లకు స్వాగత సత్కారాలతోనే తనకు సరిపోతుంది. ఆ లోపలే అన్ని ఏర్పాట్లు జరిగిపోవాలి.

ప్రసన్న తల్లో కొన్ని విచిత్రపుటూహలు వుప్పతిల్లడం వజ్రపాణి కొంచమో గొప్పో వాటి ప్రభావానికి లోనుకావడం అప్పుడప్పుడూ జరిగే విషయమే. వివాహానికి వెనుకటి సంగతి తనకు తెలియదు గాని ఆ తరువాత మాత్రం తను తన చేతి మీదుగా నాలుగుసార్లు ప్రసన్న పుట్టినరోజు పండుగ చేశాడు. అవన్నీ పట్టణంలో, తన స్వంతభవనంలో వందలాది అతిథుల మధ్య, నాట్యగానాది వినోద విలాసాల మధ్య ఎంతో వైభవోపేతంగా జరిగాయి. ఈ సారి గూడా అలా జరగ వలసిందే! కానీ ప్రసన్న మూలంగా తన నిర్ణయం తలక్రిందులైపోయింది.

పుట్టినరోజు కింక పదిరోజు లుండనగా, ఒకనాటి రాత్రి ప్రసన్న పున్నమనాటి శేరాజును చూచి పొంగిపోతున్న కడలి

కెరటాలను చూస్తూ కూచున్న మనిషి అలా చూస్తూ
కూచోక వున్నట్టుండి తల పైకెత్తి "ఈ సారి నా పుట్టినరోజు
పండుగ మన వూళ్లో జరుపుకుందామండీ!" అంది.

"ఆ పల్లెటూళ్లోనా! అక్కడేం దొరుకుతుంది
ప్రసన్నా?" అన్నాడు తను.

"కావలసినవన్నీ యిక్కడనుంచే తీసుకుపోదాం లెండి"
అంది ప్రసన్న.

"తీసుకపోవచ్చునుకో! కాని అక్కడి కెవరొస్తారు?
నువ్వూ, నేనూ, వంటమనిషి, పెట్రోమాక్స లైట్లు మోయు
డానికి నారిగాడు తప్ప అక్కడ మరెవరూ వుండరు."

"అదేమరి! ఇక్కడైతే ఇంతకుముందు మనమెప్పుడో
వాళ్ళకి ఋణపడినట్లు రిక్షాల్లో, టాక్సీల్లో వచ్చి అసంఖ్యా
కంగా వాలిపోతారు. వీళ్ళల్లో ఎందరికి మనపట్ల నిజమైన
అంతఃకరణ వుందో తెలుసుకోవాలి. పోనీ, ఇదొక పరీక్షను
కోండి. రాదలచుకుంటే డెబ్బయి మైళ్లు ఏమంత దూర
ప్రయాణం కాదు."

ప్రసన్న వాదం విన్నమీదట తనందుకు అంగీకరించక
తప్పలేదు.

ఘుమ్మని సంపెంగపూల వాసన తనదాకా రావడంతో
వజ్రపాణి లేచి కూచున్నాడు. కారు తన మామిడి తోటకి
ప్రక్కన వెళ్తోంది. పట్టణంలో తనకోసం సర్వదా కాచుకుని
వుండే వెయ్యి వ్యవహారాల బాదరబందీనుంచీ ఎలాగో బయట
బడి స్వగ్రామానికి తిరిగి వచ్చినప్పుడల్లా ముమ్మందుగా

మామిడి తోటలో నుంచీ సంపెంగపూల మధుర సుగంధం ఎదురై వచ్చి తనకు స్వాగతవచనం పలుకుతుంది. ఆ తోట, తోట లోపల దిగుడు బావి, బావి చుట్టూ నందివర్థనం చెట్లు, వాటిచెంత పండ్లు విరుగగాచే జామచెట్లు, అవన్నీ తన చిన్ననాటి నేస్తాలు. అక్కడ కూచుంటే ఎంతటి చిరాకైనా యిట్టే మాయమైపోతుంది. కానీ యీ ప్రశాంత వాతావరణంలో తనెంతోకాలం మెలగలేదు. రెండు మూడు రోజుల్లోనే యీ స్తబ్ద వాతావరణం తనకు వెగటైపోతుంది. ఉత్సాహంతో పురకలు వేసుకుంటూ ఒక క్షణమైనా ఆగిపోకుండా ముందుకు సాగే జీవితం కావాలి తనకు! అదిక్కడ లభించదు.

కారు ఊరి పొలిమేరదాటి పెద్ద వీథిని సమీపిస్తోంది. ఆ ఊరికి రాజవీథయినా, బజారు వీథయినా అదే! వజ్రపాణి కొంచెం ముందుకు జరిగి కూచుని ఊరివైపు చూడసాగేడు. తన బంగళా ఊరి కవతల పూలతోటలో వుంది. పట్టణం నుంచీ రాకపోకల సందర్భంలో తప్ప మరొకప్పుడు తను ఊళ్ళోకి రావలసిన అవసరం వుండదు. ఒకవేళ తప్పీదారీ వచ్చినా ఊళ్లో ఆ బాలగోపాలమూ తనని వింత జంతువులా చూస్తుంది. అదలా వుండగా, కాలినడకతో ఆ పల్లెటూళ్లో తిరగడం తనకి నామోషీగా కనిపించే మాట కూడా నిజం!

కారు పెద్ద వీథిగుండా పరుగెడుతోంది. వజ్రపాణి టిన్ను తెరచి మరో సిగరెట్టు పైకి తీశాడు. పెట్టెపైన అగ్గి

పుల్ల చరాలున గీచి ముట్టించుకోడానికి పై కెత్తాడు. కానీ ఉన్నట్టుండి పడిన బ్రేకుతో కారు హఠాత్తుగా వీధి మధ్య ఆగిపోవడంతో, ఆ అగ్గిపుల్ల మధ్యలోనే ఆరిపోయింది.

"ఇక్కడేదో దొమ్మీ జరుగుతోందండీ!" అన్నాడు డ్రయివర్.

"వాటికేం తక్కువ! బ్రతకడ మెలాగో తెలియక పోయినా కక్షలుగా చీలి చావబాదుకుని కోర్టుల వెంబడి తిర గడం వీళ్ళకి బాగా అలవాటైంది. నువ్వు త్రోవ చేసుకుని కారు స్టార్టు చెయ్" అన్నాడు వజ్రపాణి.

కానీ త్రోవ చేసుకోడానికి అహమద్ చేసిన ప్రయ త్నాలు ఫలించలేదు. వీధిలో పిన్నా పెద్దా, పిల్లా జల్లా రెండు మూడు వందల మంది పోగయ్యారు. ఆ గుంపులో ఎక్కడ ఎవరు ఎవరిపైన చేయి జేసుకుంటున్నారో అహమద్ గుర్తించలేక పోయాడు. 'త్రోవ, త్రోవ' అంటూ అతడు తన శక్తికొద్దీ అరవనైతే అరవగలిగాడు గానీ, ఎంతటి అర పైనా మంచి రసపట్టులో వున్న దొమ్మీ ముందు లవలేశ మైనా పనిచేయదని అత డూహించుకోలేక పోయాడు.

ఇంతలో కారు చుట్టూ కూడా జనం ప్రోగయ్యారు. కుర్రకారుకు వజ్రపాణి కారు పుష్పక విమానంలా కనిపించి వుండాలి మరి. వాళ్ళు దాని కానుకుని లోపల ఎంత టెంతటి వింతలున్నాయోనని తొంగి చూడసాగారు. పోట్లాడుకుంటున్న వారి మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తున్న పెద్దల్లో సైతం ఒకరిద్దరు ముందుకు పరుగెత్తి వచ్చి "సరిగ్గా సమయానికి

వచ్చారు బాబూ! మీకు వెయ్యేళ్ళాయుస్సు. మరే మనకో తుండా యిక్కడ్డోసారి దిగాలి మీరు" అంటూ చేతులు జోడించారు.

"గొప్ప ఘనకార్యమే చేస్తున్నారు. ఇక్కడ ఆగి వ్యవహారాన్ని ఫయిసలా చేస్తూ కూచోడానికి నాకు తీరిక లేదు" అన్నాడు వజ్రపాణి.

ఇరుపక్షాలకూ రాజీ కుదర్చడంలో తలగుడ్డను సైతం ఎక్కడ్డో దారబోసుకున్న వృద్ధుడొకడు మరీ ముందుకు వచ్చి "బాబ్బాబూ! మీరే అలాగంటే మేమేం చెప్పాలి? మా కష్టనష్టాలు మే మెవరితో చెప్పుకోగలం బాబూ! పెద్దబాబు గారి హయాంలో గ్రామంలో కిసుక్కని శబ్దం పైకి రేగేది కాదు. ఆ మారాజు చనిపోయి స్వర్గలోకంలో వున్నారు. ఈ గడుగ్గాయి కుర్రాళ్ళు బొత్తిగా మా మాట వినిపించుకోడం లేదు. ఏం చేయమంటారు?" అన్నాడు.

వృద్ధుడు వినయంగా మనవి చేసుకున్నట్టే కనపడ్డాడు. కానీ ఆ మనవి వజ్రపాణిలో అభిమానాన్ని రెచ్చగొట్టింది. అందుకు ఫలితంగా అతడు చరచరా కారు దిగి "ఏయ్, ఏమిటా గోల!" అంటూ ముందుకు నడిచాడు.

క్షణంలో గగ్గోలు ఉపశమించింది. ఎక్కడి వారక్కడే మౌనంగా నిలబడ్డారు. ఛాతీపైన సేలం జరీకండువా రెపరెపలాడుతుండగా వజ్రపాణి జనసమూహం మధ్యకి నడిచి "అసలు సంగతి చెప్పండి" అన్నాడు.

అసలు సంగతి మరొకరు చెప్పకపోతే వజ్రపాణి ఊహించు తగలనంత క్లిష్ట విషయమేమీ కాదు. ఇంతకూ అక్కడ జరిగింది కారు డ్రయివర్ వూహించినట్టు దొమ్మీ కాదు. దాన్ని దొమ్మీ అనడమే అనుచితం. ఇరుపక్షాలా కొంత బలగంచేరి కర్రలతో కటారులతో ఒకరితో ఒకరు తలపడ్డం దొమ్మీ అని వ్యవహరింపబడుతుంది. ఇది అలాటిది కాదు. ఇక్కడా ఏ ఎనిమిది మంది దృఢకాయులు బాణా కర్రలు, బటతెల్లాంటి శస్త్ర సంపత్తితో రంగాన మోహరించి వున్నమాట నిజమే! కానీ రెండోపక్షాన వున్నది మాత్రం ఒక్కడంటే ఒక్కడు! అతడు నేలపైన బోరగిలబడి లేవడానికి వృథా ప్రయత్నాలు చేస్తున్నాడు. జగడంలో దెబ్బల తాకిడికి చిరిగి చీలికలు వాలికలై పోయిన అతడి దుస్తులపైన నెత్తురు మరకలు నీ రెండలో నిగనిగలాడుతున్నాయి. కాలిపైన తగిలిన బలమైన గాయంనుంచి యింకా రక్తం ప్రవహిస్తోంది.

కారొకటి వచ్చి వీధిలో ఆగిందనీ, అందులో నుంచి వజ్రపాణి దిగాడనీ తెలియగానే పద్మవ్యూహం పన్ని ఒంటరి పాటున తమ చేతిలోపడ్డ ఎదుటివాడి పనిపట్టడానికి కృతనిశ్చయులైన ఆయుధపాణులందరూ రెండడుగులు వెనక్కివేశారు. ఒకరిద్దరు వజ్రపాణి దృష్టికి అందకుండా పారిపోజూచారు. కాని వాళ్ళకా అవకాశం దొరక్కముందే వజ్రపాణి రంగంపైకి వచ్చి నిలబడ్డాడు.

"ఎవడు వీడు, ఎందుకిలా చావబాదేశారు?" అని మళ్ళీ ప్రశ్నించాడు వజ్రపాణి.

"తెలియలేదా అన్నయ్యా! నేనే రంగణ్ణి!" అంటూ బాణాకర్రలకు, బడితెలకు శరీరాన్ని అప్పగించి చిత్తైన వ్యక్తి తన ముఖాన్ని వజ్రపాణి వైపు త్రిప్పాడు.

కాలికింద పడబోయిన కోడమ త్రాచును చూచి బెంబేలుపడి పారిపోయే పాంథుడిలా రంగడి ముఖం కనబడగానే వజ్రపాణి త్రుళ్ళిపడ్డాడు. వీడు రంగడు. తృణీకారమనే ఏకైకాయుధంతో లోకాన్ని నిర్భీతిగా ఎదిరిస్తున్న రంగడు వీడు!

రంగడిపైన వజ్రపాణికి ఏనాడూ సదభిప్రాయం లేదు. బ్రతకడం చేతకానివాళ్ళు, సుఖించడానికి పసలేనివాళ్ళు ప్రపంచంపై తిరగబడ్డ తప్ప మరేమీ చేయలేరని వజ్రపాణి నమ్మకం. అలాటి వాళ్ళలో రంగడు ఒక్కడు మాత్రమే కాదు, అగ్రగణ్యుడని కూడా వజ్రపాణి విశ్వసిస్తాడు.

రంగడి ముఖం కనపడిన తర్వాత వీధిలో ఎంతోసేపు నిలబడడానికి వజ్రపాణికి మనస్కరించలేదు. ఈ రంగ డెలాటివాడో తన కాదినుంచీ తెలుసు. ముంజేతి కంకణానికి అద్దం అవసరం లేదు. ఎంతటి దురాగతం చేసివుండకపోతే ఒక్కసారిగా వీడు యిందరికి కానివాడౌతాడు! అదీగాక వీధిలో నిలబడి నిల్చున్నపాటున పరిష్కరించడానికి వీలున్న వ్యవహారం కాదిది. పల్లెటూరి రచ్చలకు, రగడలకు బీరకాయ పీచు

లాంటి మూలకారణాలుంటాయి. వాటిని వింటూ కూచో డానికి యిది సమయం కాదు.

వజ్రపాణి బిరబిరా కారు దగ్గరికి వెళ్ళి "రాచకార్యం వెలగబెట్టింది చాలుగానీ యిక అందరూ యిళ్ళకు వెళ్ళండి. మళ్ళీ ఏదైనా గొడవ జరిగిందని విన్నానంటే పోలీసులకి కబురు పంపిస్తాను. కమ్మల్లోపల కొంతకాలం వుండి వస్తేగానీ మీ తిక్క కుదరదు" అంటూ లోపల కూచుని "పోనీవోయ్ అహమద్" అన్నాడు.

లాంఛన ప్రాయంగా ఒకసారి హెచ్చరించి, అంతటితో వజ్రపాణి చల్లగా జారుకుంటాడని అక్కడున్న వాళ్ళెవరూ అనుకోలేదు. అతడలా వెళ్ళిపోవడం చాలమందికి ప్రమోదం కలిగించింది. రంగడు వజ్రపాణికి చిన్నానాన్నకొడుకే కావచ్చు. కాని అతడి దృక్పథంలో రంగడు దుర్మార్గుడు, అవినీతిపరుడు. కాబట్టే అతడు ముఖావంగా వూరుకోలేక మాటవరుస కొకసారి మందలించి తనదారి వెంబడి తాను వెళ్ళిపోయాడు.

తోటలో విందు పూర్తయ్యేసరికి రాత్రి పదిగంట లైంది. అంచనాకంటే ఎక్కువమందే వచ్చారు అతిథులు. రాకేం చేస్తారు! వజ్రపాణి వ్యాపారం అలాంటిది. అతడి పెట్టుబడిపైన ఆధారపడి ఒకటి రెండు ఫిలిం కంపెనీలు పని చేస్తున్నాయి. పెద్ద ఎత్తున ఒక సినిమా పత్రిక నడపడానికి కూడా అతడి ఆధ్వర్యాన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇట్టి పరిస్థితిలో వజ్రపాణి ఆశ్రితుల సంఖ్య అతని అంచనాని అతిక్ర

మించడం అంత ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. ఒకరిద్దరు రచయితలు అచ్చొత్తించిన పద్యోపాయనాలతో సహా విచ్చేశారు. సాటి నిర్మాతలు, దర్శకులు, ఇంకా మిత్రులు, బంధువులు వచ్చారు. అందరికీ తలమానికంగా ఒక్కసారి కథానాయకుడికి కంఠం అరువిచ్చి ఒక ప్రణయగీతంతో ప్రేక్షక ప్రపంచానికి తన్మయత్వం కలిగించడానికి ఉవ్విళ్ళూరుతున్న గాయకు డొకడు వచ్చాడు. "తమ గానసుధ మధురాతి మధురం! దాన్నింతకంటె సేవించి అరిగించుకోగల శక్తి మాకు లేదు" అతిథులు విన్నవించుకునేంతవరకూ అతడు తనివితీరా పాడి శ్రోతల్ను రంజింప చేశాడు.

అతిథులందరూ మేడపైన పడుకున్నారు. అశ్వమేధ యాగం సాకల్యంగా నిర్వహించినంత తృప్తితో వజ్రపాణి మేడ ముంగిట ఆరుబయట ఈజీచైర్‌లో కూచున్నాడు. వెన్నెల పాలార కాస్తోంది. ఏ క్షణాన్నయినా పిలుపందుకోడానికి సిద్ధంగా నారిగాడు దగ్గరలోనే నిల్చుకుని అయ్యగారి ముఖంకేసి చూస్తున్నాడు.

ఐదు నిమిషాలు ఆలోచనతో గడపివేసిన తర్వాత వజ్రపాణి "ఒరే నారిగా! ఇలా దగ్గరికి వచ్చి కూచో" అన్నాడు.

నారిగాడు దగ్గరికి వచ్చాడు. అయ్యగారికి తన అంతరంగిక కార్యదర్శికత్వం అవసరమైందన్న సంతోషం వాడి ముఖాన చిందులు ద్రొక్కుతోంది.

"రంగడి నొకసారి రమ్మని చెప్పావు కదూ?"

"ఇంటికి వెళ్ళానండీ! గాయాలకు కట్లు కట్టుకోడాని కని అతడు రామాపురం వెళ్ళాట్ట!"

"ఎవరు చెప్పారు?"

"అతడూ, ఆవిడా తప్ప యింకెవరున్నారండీ ఆ యింట్లో? ఆవిడే చెప్పింది."

వజ్రపాణి ఉలిక్కిపడి లేచి నిటారుగా కూచుంటూ "ఏమిట్రా నారిగా! ఈ మధ్య వీడేమైనా కథ నడిపించా డేమిటి? ఆవిడా, గీవిడా అంటున్నావు" అన్నాడు.

ఆ ప్రాంతంలో అందరికీ సుపరిచితమైన రంగడి ప్రణయ గాథ ఇంతవరకూ అయ్యగారి చెవులదాకా వెళ్ళనందుకు నారి గాడు విస్తుపోయాడు. ఎంతగా నాగరికత ముదిరిపోయినా యిప్పటికీ అక్కడక్కడా తోటరాముడిలాటి వ్యక్తి రాకు మారి లాటి జగదేక సుందరిని వలచీ వలపించుకోగల డనడా నికి రంగడి ప్రణయగాథ చక్కని తార్కాణం. రంగడు వజ్ర పాణి మామిడి తోటకు కొద్ది రోజులపాటు కాపుదారీ నిర్వ హించాడు కూడా! వాడి హయాంలో ఆ తోపు వాడికీ, వాడి నేస్తాలకూ క్రీడాస్థలంగా ఉపకరించింది. రంగడు భాగ్య వంతుడుగా పుట్టలేదు గాని, ఉన్నంతలో మాత్రం వాడిది ఎముకలేని చేయి! కంచెకావల నిలబడి 'బాబూ! ఒక మామిడికాయ యిలా పడేస్తారూ!' అని అడగనివాళ్ళది పాపం గాని, చిరాకు, కోపం, అహంభావం ఇలాటి వేవీ లేకుండా కాయల్ని తీసి అవతలికి గిరవాటు వేయడానికి రం గడు సర్వదా సంసిద్ధుడు. అందువల్ల వాడి నిరవాకంలో

మామిడితోపుకు కీర్తిప్రతిష్టలు హెచ్చి, వజ్రపాణికి ఆదాయం సన్నగిల్లసాగింది.

తోటకాపరితనం కాస్తా వూడిపోయిన తర్వాత రంగడు నూలులేని గాలిపటంలా కొంతకాలం దేశమంతా చెడ తిరిగాడు. ఎలా తిరిగినా కవళం తిరిగి తిరిగీ నోటిదగ్గరికే రావలసినట్టు రంగడు మళ్లీ మళ్లీ స్వంత వూరికే తిరిగి రావలసివచ్చేది. జననీ, జన్మభూమి స్వర్గంకన్నా ఎక్కువన్నారు మరి! రంగడికి జనని లేదు, జనకుడూ లేడు. జన్మభూమి మాత్రం వుంది.

ఒకసారి రంగడు ఎంతదూరం వెళ్ళాడో, ఏంచేశాడో గానీ వెళ్ళిన మూడు నెలలకు తిరిగి వచ్చాడు. వస్తూ, వస్తూ వాడొక పిల్లనగ్రోవిని తీసుకొచ్చాడు. దానిపైన వాడు చేసిన సాధన చుట్టుప్రక్కల వాళ్ల కందరికీ రిచ్చపాటు కలిగించింది. రాత్రి భోజనమైన తర్వాత భజనగుడి ముందు రచ్చపైన నందీశ్వరుడి కానుకుని కూచున్నాడంటే వాడి వేణుగానం మెల్ల మెల్లగా అలలు అలలుగా సాగి, పరిసర వాతావరణాన్ని మత్తుతో నింపివేసేది. ఊదుతూ, ఊదుతూ అలాగే నేలపై కొరిగి పిల్లనగ్రోవిని చేతిలో వుంచుకునే రంగడు నిద్ర పోయేవాడు.

ఊళ్లో మాత్రం రంగ డెంతటి నిరాదరణకు పాత్రుడయ్యాడో, వాడి వేణుగానమూ అంత నిర్లక్ష్యానికి పాత్రమైంది. ఒకరి మెరమెచ్చుల కోసం ప్రారంభించిన కృషి కాకపోడంచేత రంగడు అందువల్ల నిరుత్సాహపడటం సంభవించలేదు. జోలపాటలా వుండవలసిన వేణుగానం రచ్చకు దాపున

కాపురమున్న వాళ్లకి నిద్రాభంగ హేతువుగా పరిణమిస్తోం దని తెలిసినప్పుడు గూడా రంగడు ఖేదపడలేదు. తను వాళ్ళకి అయిష్టుడు. తనపట్ల వారికున్న కూరిమి కొద్దిపాటిది. ఆ కూరిమి తను వాళ్ళకి చాకిరీ చేసినంతవరకు మాత్రమే వుండి, తరువాత రంగంపైనుంచి తెరవెనుకకు వెళ్ళిపోయే నాటక పాత్రలా మాయమైపోతుంది. ఆ పైన తను చేసిన ప్రతి పనీ వాళ్ల అవహేళనకీ, అసహ్యతకీ గురౌతుంది. అందుకు చింతించి లాభం లేదు.

లేమిచేత బాధపడుతూ అష్టకష్టాలు ఎదుర్కోవలసిన మనిషి గూడా తన జీవితంలో ఎక్కడో ఒకచోట టర్నింగు పాయింట్ వుంటుందనీ, ఆ పైన తనకోసం నవజీవనానందం కాచుకుని వుంటుందనీ కలలు కంటాడు. ఆ విశ్వాసంతో బ్రతుకుతాడు. రంగడి కాలాంటి ఆశ కూడా లేదు. కాని ఆశ ఉద్భవించడానికి ఎంతసేపు కావాలి? ఒక క్షణం చాలు.

ఓ రోజు ఉదయం రంగడు కొంచెం ఆలస్యంగా నిద్ర లేచి కళ్లు నులుముకుంటూ పాకలోనుంచీ బయటికి వచ్చాడు. అప్పటికి రెండుబారల ప్రొద్దెక్కింది. టముకుపైన కర్రవేసి ధణధణా వాయిస్తూ ఊరంతా చుట్టి యింటికి వెళ్తున్న తోటి లింగమయ్య "విన్నావా రంగయ్య బాబూ! నాటకం వచ్చింది నాటకం. రాయప్ప కంపెనీది" అన్నాడు.

"రానీలేరా! డబ్బు దండుకోడాని కేదో వస్తుంటుంది" అన్నాడు రంగడు.

రంగడికైతే నాటకంపట్ల ఆసక్తి లేదు గానీ, ఆ ప్రాంతంలో రాయప్ప కంపెనీ నాటకం పేరు చెబుతే కాపులు, కూలీలు చద్దికూళ్ళు కట్టుకుని, తిరణాళ్లకు బయల్దేరినట్టు తోదులు తోదులుగా కదలివస్తారు. కానీ ఖర్చు లేకుండా ప్రొద్దుపొడిచి రాచిన గొంతుకతో చోపుదారి మంగళం పాడేవరకూ నడివీధిలో ఆకాశం క్రింద కూచుని వీధి నాటకం చూడ్డానికి అలవాటుపడిన ముసలివాళ్లు 'నాలుగ్గంటల సంబడానికి నాలుగణాలు తగలేయడమేనట్రా! మా కాలంలో మే మెరగమబ్బా యీ చోద్దాలు' అని మూతి ముడుచుకునే వారు. కాళ్లల్లో బలముండి సునాయాసంగా నడవగల కుర్రవాళ్ల ధోరణి వేరు. వెధవ నాలుగణాలు! రెండు రోజులు వక్కాకు, బీడీలు మానుకుంటే పోలా! ఆ కంపెనీలో వున్నారే యిద్దరు అమ్మాయిలు, వాళ్లు వేసే ఒక్క అడుగుకి, పాడే ఒక్క పదానికి యిచ్చేయవచ్చు నాలుగణాలు!

నిజమే మరి! రాయప్ప మేనగోడళ్లు అడుగు చక్కగానే వేస్తారు. పాట బాగా సాగదీసి పాడుతారు. ఆ ఆటా, ఆ పాటా మగాళ్లకి తెలియకుండా అదీ యిదీ అంగడిలో పోసి అమ్మలక్కలు నింపుకున్న వక్కాకు తిత్తుల్ని ఖాళీ చేస్తాయి. ఇంటి ఖామందుకు తెలియకుండా తమలపాకు లమ్ముకుని రొండిలో దోపుకున్న పాలేరు గుప్తనిక్షేపాన్ని హరిస్తాయి.

అటు వీధి నాటకమూ గాక, ఇటు డ్రామాను గాక రెండింటి సాంకర్యం చేత సిద్ధించిన విచిత్ర రూపకాలు రాయప్ప కంపెనీవి. అవి డిమాలో, వ్యాయోగాలో, ఈహామృ

గాలో ఆ దశ రూపకర్తే చెప్పాలి. వాటిని చూచే ప్రేక్షకులు మాత్రం ఏక కంఠంగా ఒకే మాట చెబుతారు. "నాటకమంటే రాయప్ప కంపెనీ నాటకంరా! అబ్బబ్బ! ఏం సీనులు, ఏం డాన్సులు; బయస్కోపు ఎందుకురా దీని దగ్గర."

మొదటి రాత్రి కృష్ణలీలలు జరిగాయి. రంగడు సగం ఆటలో టికెట్టు లేకుండా కంచెదాటి లోపలికి వెళ్ళి ఓ మూల కూచున్నాడు. అప్పుడు బృందావనంలో గోపికా లోలుడి వేణుగాన వినోదం జరుగుతోంది. రంగడు కొంతసేపు విని మరి వినలేక చెవులు మూసుకుంటూ "అబ్బాయబ్బాయ్! అది పిల్లనగ్రోవి కాదురా బాబూ! చావు మేళంలా వుంది, ఆపు, ఆపు" అని కేకవేశాడు. హార్మోనియం వెనుక నిలబడి ప్రేక్షక లోకంపైన తన నాటకం ఎలా పనిచేస్తున్నదా అని తొంగితొంగి చూస్తున్న కంసవేషధారి రాయప్ప ఆ మాటతో మండిపడి "ఎవరది, ఎవరది" అంటూ రంగంపైకి వచ్చాడు, అలాటి సమయాల్లో వెనుకాడే స్వభావం కాదు రంగడిది. వాడు పైకి లేచి "నేనేనయ్యా ఆ మాట అన్నది" అన్నాడు.

రాయప్ప ఆగ్రహోదగ్రుడై పోయాడు. "ఏమయ్యో మీరాసాహెబ్! అయ్యా చంద్రయ్య నాయుడూ!" అంటూ నాటకం కంట్రాక్టుదార్లని పిలిచాడు. వాళ్లకు టికెట్లు అమ్ము కోడంపైనవున్నంతశ్రద్ధ నాటకంజరగాలా, లేదా అన్న విషయం పైన వుండదు. బుకింగ్ ఆఫీసు మూసుకుని వాళ్లెప్పుడో ఊళ్ళోకి వెళ్ళిపోయారు. సభలోనుంచి పదిమంది పెద్ద మను షులు పైకి లేచి "నీకేం తెలుసులే కూచోరా!" అంటూ

రంగణ్ణి మందలించి, రాయప్పని మళ్లీ తెర వెనక్కి— పొమ్మని ప్రాధేయపడి నాటకం సక్రమంగా జరిగేటట్టు చూచారు.

వరుసగా ఐదు రాత్రులు నాటకాలు జరిగాయి. ఆరో రోజు సాయంత్రం రాయప్ప సహచరులు కొందరు వెంట రాగా హార్మోనియం మెడకు తగిలించుకుని ఊళ్ళో వసూళ్ల కోసం బయల్దేరాడు. పెద్ద వీధి పూర్తై సందులోకి తిరిగేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. రాయప్ప వున్నట్టుండి ఒకచోట ఆగిపోయాడు. ఆగి "ఎక్కడిదా పిల్లనగ్రోవి?" అన్నాడు.

పాట వింటూ రాయప్పని వెంబడిస్తున్న కుర్రాడొకడు "అదా! ఆ నాడు మీ నాటకానికి ఒంక బెట్టిన వాడిది" అన్నాడు.

రాయప్ప వసూళ్ల మాట కట్టిపెట్టి రంగడి పాక దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు. పాకముందు గంగరావిచెట్టు క్రింద కూచున్న రంగడు "ఏం రాయప్పా! వసూళ్ళకోసంవచ్చావా? నేను యిచ్చేవాణ్ణి కాదు, పుచ్చుకునేవాణ్ణి" అని పకపకా నవ్వాడు.

"పోనీ, పుచ్చుకుందువు గాని ఒక పాట పాడి విని పిస్తావా బాబూ!" అన్నాడు రాయప్ప.

రంగడు మళ్ళీ పిల్లనగ్రోవి అందుకున్నాడు.

పాట పూర్తైన తర్వాత రాయప్ప ఇంటివైపు చూస్తూ "దీపం కూడా వెలిగించకుండా యిక్కడ కూచున్నావేం బాబూ?" అన్నాడు.

"దీపం పెట్టేవాళ్లెవరున్నారు రాయప్పా! ఇది దీపం లేని యిల్లు" అన్నాడు రంగడు.

రాయప్ప రంగడి ముఖంకేసి తీక్షణంగా చూచాడు. సన్నగా పొడుగ్గా పరుగెత్తే పాముని తరిమి పట్టుకునే యౌవన బింకంతో మిసమిసలాడుతున్న ఆకారం. పైగా వీడు నీల మేఘశ్యాముడు. తలలో నెమిలిపింఛం లేకపోయినా, మెడలో చెంగల్వ పూలదండ లేకపోయినా రంగడు ఆ లేత వెన్నెల్లో రాయప్ప కళ్ళకు సాక్షాత్తు శ్రీకృష్ణుడిలా కనిపించాడు.

పైకి లేస్తూ రాయప్ప "నీతో ఒక మాట చెప్పాలి బాబూ! ఓ సారి నాతో వస్తావా?" అన్నాడు.

రంగడు రాయప్పని వెంబడించాడు. ఆ మరునాడు రాయప్ప కంపెనీ ఊళ్ళోనుంచీ వెళ్ళిపోయింది. వాళ్ళతో బాటు రంగడూ వెళ్ళిపోయాడు.

ఆరు నెలలపాటు అంతర్ధానమై వుండి రంగ డొకనాడు మళ్ళీ హఠాత్తుగా ఊళ్ళోవాళ్ళకి కనపడ్డాడు. వస్తూ వస్తూ వట్టి చేతులతో యిల్లు చేరుకునే అలవాటు రంగడికి లేదు. అతడీసారి రాయప్ప మేనకోడళ్లలో చిన్నదాన్ని వెంట తీసు కొచ్చేశాడు.

రంగ డావిడని లేవదీసుకొచ్చాడా, లేక ఆవిడే రం గణ్ణి లేవదీసుకొచ్చిందా అన్న చర్చ ఒకవైపు కొనసాగు తుండగానే, మరొకవైపున రంగడి సమవయస్కులు కొందరు తమకు భూమీ పుట్రా, యిల్లూ వాకిలీ, డబ్బూ దస్కమూ వున్నా తాము రంగడు చేసినంత మాత్రం పని చేయలేక

పోయినందుకు లోలోపల కుతకుతలాడి పోసాగారు. ఆ వ్యధని కప్పిపుచ్చుకోడానికి రంగణ్ణి కించపరిచి మాట్లాడ్డం కన్నా వాళ్ళకి ఉపాయాంతరం లభ్యంకాలేదు. తన తిండికే వెరవు లేని రంగడు దాన్ని భరించడమేమిటి? ఐనా నాటకాలాడే మనిషి కాపురం చేస్తుందా? ఈ మూన్నాళ్ల ముచ్చటకే యింత మిడిసిపాటా వీడికి?......ఇలా దుష్ప్రచారం కొన సాగిస్తూ వాళ్ళు రంగడినుంచి వైదొలగివుండడంపోయి, వాడి యింటి చుట్టే ప్రదక్షిణం చేయసాగేరు. ఒకరిద్దరు రంగడింట్లో లేకపోడం చూచి రమణమ్మతో సరాగాలు పోవడానికి కూడా సాహసించారు. మరొకడేమో ఒకానొక పుస్తకంలోంచి ప్రేమలేఖని తూచా తప్పకుండా కాపీచేసి దాన్ని రమణమ్మకి చాకలి ఎల్లి ద్వారా బట్వాడా చేయించాడు. "వెధవ రాస్తే రాశాడులే!" అని రంగడు దాన్ని చించి పొయిలో వేశాడు. ఈ లోకువ ఆధారంగా వాడు రమణమ్మని ఒంటరిపాటున బలాత్కారం చేయడందాకా కథని సాగదీశాడు. రంగడికి కోపం సాధారణంగా రాదు. వస్తే మాత్రం వాడు మనిషి కాదు. ఆ కోపంతో రంగడు అతణ్ణి నడివీధిలో నిలబెట్టి "నీకు అక్కా చెల్లెళ్లు, పెండ్లాం బిడ్డలు లేరా? వాళ్ల నెవడైనా యిలా బలాత్కారం చేస్తే వూరుకోడానికి నువ్వు ఉప్పూ, కారమూ లేని గడ్డి దింటున్నావా?" అని అడిగేశాడు. పది ఎకరాల సేద్యమూ, పదిమంది ప్రక్కబలమూ గల ఆ ఆసామి రంగడి పైకి హుంకరించాడు. అతడితోబాటు, అతడి అను చరులు రంగణ్ణి చుట్టుముట్టారు.

"ఐతే కథ సశేషంగా మిగిలివుందన్నమాట !" అంటూ లేచాడు నారిగాడి ద్వారా రంగడి కథ సాకల్యంగా విన్న వజ్రపాణి.

"ఇదిక్కడ ఆగిపోదు బాబయ్యా! ఇంకా సాగు తుంది" అన్నాడు నారిగాడు.

వజ్రపాణి అప్పుడే ముట్టించిన సిగరెట్టుని క్రింద పారేసి గబగబా మేడలోకి వెళ్ళి తన గదిలో పట్టెమంచంపైన పడు కున్నాడు. అతడు నిద్రపోవాలన్న సదుద్దేశంతో పడుకున్న మాట నిజమే! కాని నిద్ర రాలేదు. ఎంత ప్రయత్నించినా వీధిలో గాయాలు తగిలి పైకి లేవలేక క్రింద కూలబడిపోతున్న రంగడి స్వరూపం అతడి మనోఫలకం మీదినుంచీ మాసి పోలేదు. గట్టిగా కళ్లు మూసుకున్నాడు. తన వ్యాపారం గురించి ఆలోచించుకోడానికి ప్రయత్నించాడు. మూడోజాము కూడా మెలకువతో వుండగానే గడచిపోయింది. తెల్లవారు జామున మాత్రం ఒక చిన్న కునుకు మగతగా వజ్రపాణిని క్రమ్ముకుంది. ఆ నిద్దలో కల! కలలో రంగడు మళ్లీ అతనికి కనిపించాడు.

రంగణ్ణి తీవ్రంగా మందలింప దలచుకున్నాడు వజ్రపాణి. "ఒరే రంగడూ! ఋజుమార్గంలో నడవక బ్రతుకంతా డొంక తిరుగుళ్లతోనే గడిపివేయడానికి నిర్ణయించుకునే వాళ్లలో నువ్వు మొదటివాడివి. లోకంలో అందరూ మహారాజులే వుండరు. పేదవాళ్ళు కూడా వుంటారు. కాని ఆ పేదవాళ్లు కూడా బ్రతకడానికి ఏదో ఒక జీవనోపాధి చూచుకుంటారు.

నువ్వలాటి బ్రతుకుతెరువు చూచుకోలేదు. నువ్వు తింటే తింటావు, లేకుంటే పస్తుంటావు. పనిచేస్తే చేస్తావు, లేకుంటే కాళ్లు బారగిల చాపుకుని పడుకుంటావు. అదీ ఒక జీవిత విధానమే కావచ్చు. కానీ అంత సులభంగా బ్రతకదలచుకునే వాళ్ళకు యితర ఝుంఝాటా లేవీ వుండగూడదు. నువ్వొక్క-డెక్క-డో నాటకా లాడేదాన్ని తెచ్చి యింట్లో వుంచుకున్నావు. తాను దూరడానికే సందు లేకపోతే, మెడ కొక డోలేమిటి? నీ పిచ్చి గాకపోతే, ఆవిడ నీతో కాపురము చేస్తుందా? అప్పుడే వూళ్లో ఏదో రగడ బయలుదేరింది. ఈ రచ్చకు కారణం ఆవిడేనని నేను చెప్పడంలేదు. ఊరంతా ఆ మాటే అంటోంది. అడుసు త్రొక్క-నేరాదు. త్రొక్కే-శావు. పోనీ, ఇప్పుడైనా కాళ్ళు కడుక్కో-!"

ఇన్ని మాటలూ విని రంగడు వజ్రపాణికి దగ్గరగా వచ్చాడు. వస్తూ మెల్లగా "అన్నయ్యా!" అన్నాడు. వజ్రపాణి ఉలిక్కి-పడి తల పైకెత్తాడు. "నాకు అప్పుడప్పుడూ మంచి మాటలు చెప్పడం నీకలవాటు. నువ్వు నా మీద మోపిన నేరాలన్నీ చాలామట్టుకు నిజమైనవేనని నేను ఒప్పుకుంటున్నాను. నేరస్థుడినిగా నా సంజాయిషీ గూడా నువ్వు దయచేసి వినాలి. మొదటిది: నేనొక బ్రతుకు తెరువు చూచుకోలేదు. ఏ పూట కా పూట తిండికోసం వెదుక్కో-డమే నా బ్రతుకు తెరువు. నాకొద్దిపాటి చదువు ఏ ఉద్యోగానికి పనికొస్తుంది. రెండోది: నేను తిండి తింటాను. లేకుంటే పస్తుంటా నన్నావు. నిజమే! దొరికితే తింటాను. లేకుంటే

పస్తుంటాను. నేను సోమరివాణ్ణి కాను. పనిదొరికితే చేయ డానికి నే నెప్పుడూ సిద్ధంగా వుంటాను. పని దొరక్కపోతే కాళ్లు బారగిల చాపి పడుకోక మరేం చేయాలో నాకు తోచదు. అంత సులభంగా బ్రతకదలచుకునే వాళ్లకు యితర ఝంఝాటా లుండగూడ దన్నావు. నీకు తెలియదేమో గాని ఇంటింటికీ తిరిగే బిచ్చగాడి కొకడికి యిద్దరు పెళ్ళాలు, పది మంది బిడ్డలూ వుండడం నే నెరుగుదును. ఐనా నేను కోరి కోరి యీ ఝంఝాటాన్ని తెచ్చుకోలేదు. ఆవిడ నన్ను నమ్మింది. ఉన్నచోట వుండడానికి వీల్లేక యిలా వచ్చేశాం. పోలిక కోసం కాదు గానీ యిక్కడొక విషయం చెప్పాలని పిస్తోంది. నువ్వు కాలేజిలో చదువుతూ ఒకమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకున్నావు. పెదనాన్నగా రందుకు ఒప్పుకోలేదు. కానీ నువ్వు పట్టుబట్టి కూచున్నావు. ఆవిడని పెళ్ళి చేసుకు న్నావు. నువ్వు వర్ణాంతర వివాహం చేసుకున్నందుకు వెయ్యి మంది నిన్ను పొగిడారు. నన్నలా పొగడవలసిన అవసరం బొత్తిగా లేదు. హేళన చేయకుంటే చాలు. అదీ నాకు పది వేలు. ఇంతకూ నే నావిడని పోషించవలసిన అవసరం కూడా లేదు. ఆవిడా నాతోబాటు ఏ పని చేయడానికైనా సిద్ధంగా వుంది. లోకంలో కోట్లకొలది జనం బ్రతుకుతున్నారు. మే మిద్దరం బ్రతకలేకపోము. మా పాటుకు మమ్మల్ని బ్రతక నివ్వడంకన్నా, మాకు యితరులు చేయవలసిన మేలు ఏదీ లేదు. నేను అడుసు త్రొక్కానన్నావు. ఎక్కడ త్రొక్కానో నాకు తెలియడం లేదు. నా కాళ్ళకి బురదా లేదు. అందు చేత దాన్ని కడుక్కోవాలన్న ప్రసక్తి అసలే లేదు.''

తలుపుపైన ఎవరో దబదబ బాదుతుండడం విని వజ్ర పాణి మేలుకున్నాడు. సూర్యకిరణాలు కిటికీగుండా పైకి వచ్చి పడుతున్నాయి. నారిగాడు తలుపు కావలినుంచీ "బాబూ, మీ కోసం రంగయ్య వచ్చాడు" అన్నాడు.

"ఇప్పుడు నేను పట్నం వెళ్లాలి. తీరికలేదు, వెళ్ళి పొమ్మను" అన్నాడు వజ్రపాణి.

*　　　*　　　*

మూడు నెలలు గడచిపోయిన తర్వాత వజ్రపాణి మళ్లీ స్వగ్రామానికి తిరిగి రావడం తటస్థించింది. హేమంతం జరుగుతోంది. ప్రతి సంవత్సరమూ మంచుకాలం రాగానే ప్రసన్న పొడిపొడిగా దగ్గడానికి ప్రారంభిస్తుంది. ఆ పొడి దగ్గుకు పేరు పెట్టడంలో నైతే డాక్టర్లు ఒక్కొక్కరూ ఒక్కొక్క పోకడ పోయినా నయం చేయడంలో మాత్రం అందరూ విఫలులై, కడకు శిశిర హేమంతాలు నాలుగు నెలలు రోగి కంప్లీటు రెస్టు తీసుకోవాలని సలహా యిచ్చారు. 'రెస్టు' అనేది పది అనేచోట పదిహేనుగా పారేస్తే పట్ట ణాల్లో లభ్యమయ్యే వస్తువు కాదు. అందుచేత ప్రసన్న పల్లె టూళ్ళోనే వుండిపోవలసి వచ్చింది.

కారులోనుంచీ దిగుతూనే వజ్రపాణి ప్రసన్న ఆరో గ్యాన్ని గురించి పరామర్శించాడు. టిఫిన్ తీసుకుని, తోట లోకి వెళ్ళి ఒకసారి నలువైపులా కలయచూచి వచ్చి, అభ్యంగస్నానం నిర్వర్తించి, భోజనమైన తర్వాత పడుకు

న్నాడు. తల గడిగినినాటి నిద్ర గాఢంగా పట్టింది. టంగు టంగున గడియారం మ్రోగడం విని లేచి టైం చూచాడు. నాలుగైంది. ఎదుట టేబుల్ పైన వున్న ఫ్లాస్కు తీసి కాఫీ గ్లాసులో పోసుకుని త్రాగాడు. పడకపైనుంచి దిగడానికి మనస్కరించడం లేదు. అక్కడే వున్న న్యూస్ పేపరు తీసి పుటలు త్రిప్పుతూ కూచున్నాడు.

హాల్లోనుంచీ అడుగులసవ్వడి వినిపించింది. ప్రసన్న వస్తుందేమోనని వజ్రపాణి తల పైకెత్తాడు. కానీ హాల్లో నడుస్తున్న మనిషి ప్రసన్న కాదు. తెరచిన కిటికీగుండా వజ్రపాణి కళ్ళముందు ఒక క్షణంపాటు మెరపుతీగ పారాడి నట్టయింది, అతడు మంచంపైనుంచి క్రిందికి దూకి కిటికీ దగ్గ రికి వెళ్ళి నిల్చున్నాడు. ఒక యువతి! తనకి అపరిచిత! అదొక స్త్రీ మూర్తిగాదు, శంపాలతలా వుంది. అవును. అది శంపాలతే! మేడ మెట్లెక్కి పైకి వెళ్తోంది.

ఎవరీవిడ? వాలకం చూస్తే యీ యింటితో బాగా పరిచయమున్న దానిలా కనిపిస్తోంది. ప్రసన్న రాగానే అడ గాలి. భార్యకోసం ఎదురు చూస్తూ మళ్ళీ మంచం పైన కూచున్నాడు వజ్రపాణి.

ఐదుగంటలకు సరిగ్గా వాహ్యాళికి సిద్ధమై ప్రసన్న గదిలో అడుగు బెట్టింది. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. ఇద్దరూ మెల్లగా కొబ్బరితోట వరకూ నడిచారు. ఆవిడెవరు ప్రసన్నా? అన్న ప్రశ్న ఆలోగా నాలుగైదుసార్లు వజ్రపాణి గొంతు వరకూ వచ్చి అక్కడ వెలక్కాయ పడినట్టు ఆగిపోయింది.

ఆవిడపట్ల తనంత కుతూహలం ప్రకటించడం సమంజసం కాదేమో! ఇలా తటపటాయిస్తుండగా ప్రసన్నే ఆ ప్రస్తావన తెచ్చింది.

"ఏమండీ! మీ రావిడని చూడలా'" అంది ప్రసన్న.

గడసరితనం ఎక్కడికి పోతుంది! "ఎవర్ని ప్రసన్నా ?" అన్నాడు వజ్రపాణి.

"మీ మరదల్ని!"

"నా మరదలా!"

"అవునండీ! అలా తెల్లబోతా రెందుకూ? మరదలంటే తెలియదూ! తమ్ముడి భార్య" అంది ప్రసన్న.

"తమ్ముడోకడు! తమ్ముడికోక భార్యకూడానా! ఇదేమైనా కథా ప్రసన్నా!" ముఖంలో అమాయకత్వం ఒలికిస్తూ ప్రశ్నించాడు వజ్రపాణి.

"కథగాదండీ బాబూ! వాస్తవం. ఆవిడ మీ రంగడి భార్య."

వజ్రపాణి కీసారి కోపం వచ్చింది. "ప్రసన్నా! నువ్వు 'భార్య' అన్నమాటని కలుషితం చేస్తున్నావు. రంగడు ఆవిడని లేవదీసుకొచ్చేశాడు. ఆవిడ రంగడి కేమైనా కావచ్చు. కాని భార్యమాత్రం కాదు."

ఈ తర్కం ప్రసన్నకి అర్థంకాలేదు. "లేవదీసుకొచ్చిన మాట నిజమేనండీ! ఐతే ఎక్కడో దేవుడిముందర అతడు ఆవిడచేతిలో చేయివేసి 'యికమీదట నేను మొగుణ్ణి, నువ్వు

పెళ్ళానివి' అన్నాట్ట అప్పటినుంచీ వాళ్ళిద్దరూ భార్యాభర్త లుగా వ్యవహరిస్తున్నారు."

"బాగుంది, బాగుంది. అంటే తాత్కాలికంగా నన్న మాట!" అంటూ వికవికా నవ్వేశాడు వజ్రపాణి.

"పోనీ ఆవిడ మనయింట్లో వుందా! ఐతే యిదొక అద్భుత కథానకమే ప్రసన్నా! నేను ఆవిడ ఏదో పనిమీద మన యింటికి వచ్చిందనుకున్నాను."

"లేదు మన యింట్లోనే వుంది."

"ఎందుకూ ?"

"రంగ డిప్పుడు ఊళ్ళో లేడుగా!"

"ఏమయ్యాడు ?"

"రెండేళ్లు పడింది."

"ఏమిటి ?"

"శిక్ష!"

"అబ్బ కాస్త వివరంగా చెప్పగూడదా ప్రసన్నా! నాకు అద్యంతాలే తెలియడంలేదు" ప్రాధేయపడ్డాడు వజ్రపాణి.

"మీరు పట్నానికి వెళ్ళి పదిరోజులు కూడాకాలేదు. ఊళ్లో మళ్లీ రగడజరిగింది. రంగడు ఒకడి తల చితగ్గొట్టేశాడు."

"ప్రాణాపాయం లేదుగదా!"

"చావు దప్పి కన్ను లొట్టబోయింది. పోలీసు లొచ్చారు. రంగణ్ణి అరెస్టుచేసి తీసుకెళ్లారు."

"తత్ఫలితంగా శిక్షపడింది. అంతేకదూ ప్రసన్నా! నేనప్పుడే అనుకున్నాను. అనుకున్నంతా జరిగింది. ఈవిడని నడివీధులపాల్జేసి వాడు కమ్ముల్లోపల కూచున్నాడు."

"పాపం, రమణమ్మని చూస్తుంటే జాలిగా వుందండీ."

"ఉండదూమరి! నాపట్టివిగ్గా, పాలు బువ్వపెడతా రామ్మా అని బుజ్జగించలేక పోయావా ప్రసన్నా!"

"మీకంతా ఎగతాళిగానే వుంటుంది. ఈ రెండేళ్ళూ ఆవిడని నాదగ్గరే వుండిపొమ్మన్నాను."

"వాక్యం పూర్తిచేయకు. సుధేష్ణదగ్గర సైరంధ్రిలా అని వుపమానం కలిపితే వాక్యం సర్వాంగసుందరంగా వుంటుంది."

"ఆవిడ లేకపోతే నాకీ వూళ్ళో ప్రొద్దేపోయేది కాదేమోనండీ! ఏం చక్కగా పాడుతుందనీ!"

"గగనవీధిని దేలు ఓ మేఘమాలా! జైలుగోడల పైన మసలి వస్తున్నావా! అని పాటని సవరించుకోడం లెస్స. ఐనా మొగుడు జైల్లోవుండగా ఇక్క డీవిడ పాటలు పాడు కుంటూ కూచోవడానికి యిదేమైనా సినిమానా ప్రసన్నా!"

"అబ్బే, నా బలవంతం పైన పాడుతోందండీ! మనిషిని చూచారు గదా! మీ కళ్ళకి ఎలా కనిపించిందో మరి!"

"అచ్చం సెట్ పైకి వెళ్తున్న తారలా కనిపించింది."

ఇద్దరూ కొంత సేపు మౌనంగా కూచున్నారు. మళ్లీ ప్రసన్నే వుపక్రమించింది.

"ఏమండీ! ఒక మాటంటాను."

"ఏమంటావు?"

"మనకు చేత నైనప్పుడు యితరులకు మేలు చేయడంలో తప్పులేదు గదూ!"

"తప్పే ముంది! పరోపకారార్థ మిదం శరీరం గదా ప్రసన్నా!"

"ఐతే నేను చెప్పినట్లు చేస్తారు కదూ!"

"మరీ హిరణ్యాక్షవరం కాకపోతే సరి!"

"రమణమ్మని సినిమాలో చేర్పిస్తే?"

ఆ ఊహే వజ్రపాణిలో సైతం మెదుల్తోంది. కాని అతడు భార్యమాట కొట్టివేయ బోయాడు. "పాట బాగా పాడడ మొకటే చాలదు ప్రసన్నా వెండి తెరకి! మరికొన్ని అర్హత లుండాలి."

"ఆమెకి నటన కూడా క్రొత్త గాదుగా!"

వజ్రపాణి సీరియస్‌గా ఆలోచిస్తూ కూచున్నాడు. ఆలోచించినకొద్దీ అతడి భావస్రవంతి రెండు పాయలుగా చీలి పోసాగింది. ఒకవైపు రమణమ్మ దుస్థితికి జాలిపడుతూ, మరొకవైపున అతడు ఆవిడ నీ స్థితికి తెచ్చిన రంగడిపైన లోలోపల మండిపడ్డాడు. నే డావిడ నిలువ నీడ, పట్టుకొమ్మ లేని నిరాశ్రయ! నా అన్నవారినుంచి వేరుచేసి వీ డామె తల కెత్తిన సిరి యిది! వీ డెప్పటికైనా చెడిపోవలసినవాడే! తనతో బాటూ వీ డీమెను కూడా అధోగతివైపు లాక్కెళ్ళ

జూస్తున్నాడు. అలా జరుగుతుంటే చూస్తూ వూరుకోడానికి తన మనసొప్పదు. వారి బారినుండి యీమెని కాపాడాలి. అందుకు ప్రసన్న సూచిస్తున్న విధానం సమంజసంగానే కన బడుతోంది.

*　　　　*　　　　*

ప్రొద్దుపోయి, ఊరంతటా దీపాలు వెలిగి, వీధుల్లో జనసంచారం ఎక్కువైన ఓ సంధ్యా సమయాన రంగడు హైరోడ్డు వెంబడే నడువసాగేడు. ఆ రోజు మధ్యాహ్నమే అతడు కటకటాల్లోంచి బయటికి వచ్చాడు. తన కా రోజు విముక్తి లభిస్తుందని రంగడికి తెలియదు. అతడు తేదీలు, నెలలు గుర్తుంచుకోడానికి ప్రయత్నించలేదు. పది యిరవై రోజులైతే వాటిని లెక్కించుకోనూ వచ్చు. అవి ఒక్కొక్క టిగా గడచిపోతున్నాయని ఆనందించనూ వచ్చు. తను చెరలో గడపవలసిన రోజులు ఏడువందలకు పై చిలుకు! ఈ సుదీర్ఘ మైన చీకటిబ్రతుకు నెలా గడపడమన్న చింత లోపలినుంచి చెట్టును తొలిచివేసే వేరు పురుగులా రంగడి హృదయాన్ని దహించివేయసాగింది. అతడు తన చుట్టూ వున్న రాతిగోడని చూచేవాడు. ఆ గోడకు తల బాదుకుంటే మనోవేదన కొంత చల్లారుతుందేమో ననుకునేవాడు. కమ్ముల్ని చూచేవాడు. చేతులు చాచి వాటిని వంచి, విరిచి నుగ్గునూచ చేసివేద్దా మనుకునేవాడు. కమ్ముల్లోనుంచీ చెట్లు, వాటిపైన ఆకసంలో ఎగిరిపోతున్న పక్షులు కనిపించేవి. తనూ ఒక పక్షై వాటితో కలిసి రివ్వున పరతెంచి తన రమణి చేతుల్లో వ్రాలినట్టు,

ఆమె తనని హృదయానికి హత్తుకుని ముద్దాడినట్లు భావించే వాడు. అంతలో మళ్లీ తన నిజపరిస్థితి తెలిసివచ్చేది. "అంతా భ్రమ! ఇవి కమ్మీలు, ఇవి గోడలు, ఇది జైలు, నేను పక్షిని కాలేదు. రమణి చెంతకు పోలేదు" అనుకుంటూ కుమిలిపోయేవాడు.

రంగడు జైల్లో మనిషిలా బ్రతకలేదు. యంత్రంలా బ్రతికాడు. యంత్రానికి పని చేద్దామని గానీ, మానుకుందా మని గానీ వుండదు. మర యిటు త్రిప్పితే పని చేస్తుంది. అటు త్రిప్పితే మానుకుంటుంది. రంగడూ అంతే చేశాడు. పైవాళ్లు లేవమంటే లేచాడు. పడుకోమంటే పడుకున్నాడు. తినమంటే తిన్నాడు. లేకుంటే పస్తున్నాడు. యంత్రం పనిచేసినన్ని రోజులూ చేస్తుంది. ఎక్కడో ఒక కీలు విరిగినప్పుడు టక్కుమని ఆగిపోతుంది. రంగడి గతీ అంతే అయింది. ఓ రోజు పాతాళ గంగని పైకి తోడుతూ అతడు చేంతాడు మధ్యలో విడిచి పెట్టి దభేలున క్రింద పడిపోయాడు. కాపలా వున్న రక్షక భటుడు పరుగెత్తి వచ్చి రంగడిపైన చేయివేసి చూచాడు. జ్వరం నూటికిపైన కాస్తోంది. పై అధికారికి కబురు వెళ్ళింది. జ్వరంతో వున్న ఖైదీచేత పనిచేయించినందుకు అతడు కాపలా వాళ్ళపైన మండిపడ్డాడు. తనకు జ్వరమని రంగడు చెప్పుకో లేదు. అడగందే అమ్మయినా బువ్వ పెట్టదు. ఖైదీకి జ్వర మని గ్రహించి, వాడికి సపర్యచేయవలసిన అవసరం పోలీసు వాడికి లేదు. క్రిందపడిన తర్వాత తనకు స్మృతి రావడానికి ఎన్ని రోజులు పట్టిందో రంగడికి తెలియదు. లేచి తనవైపాక

సారి చూచుకున్నాడు. తను మునుపటి రంగడు కాడు. అస్థి పంజరం పైన చర్మపు తొడుగులా వున్న యిదేనా తన శరీరం? కాదు. రమణితో బాటూ తన రూపసంపదని సైతం ఎవరో కాజేశారు!

జ్వరం నిమ్మళించిన తర్వాత రంగడు మళ్లీ ఖైదీగా కటకటాల్లోపలికి వచ్చాడు. రోగశయ్యపైన అతడి మనసు నావరించుకున్న నిస్తబ్దత, తేరుకున్న తర్వాత కూడా అలాగే వుండిపోయింది. జీవితోత్సాహం చిదికిపోయిన ముసలివాడిలా అతడు ఎక్కడ కూచుంటే అక్కడే కూచుని వుండిపోయే వాడు. పని చేస్తూ చేస్తూ అలసిపోయి కుప్పగా నేలపైన కూలబడేవాడు. తా ననుభవించవలసిన రెండేళ్ల శిక్ష ఎప్పుడో పూర్తైనట్టు, అయినా తన నిస్సహాయతని గుర్తించిన అధికారులు మరికొంత కాలం తననుండి చాకిరీ చేయించుకుని తనని చిత్తు చిత్తు జేసి వదలిపెట్టనున్నారనుకుని అతడు అర్ధరాత్రప్పుడు ఘోరున విలపించేవాడు. కాని అది అపోహని అతడికి అచిర కాలంలోనే తెలియ వచ్చింది. చింతలతో వంతలతో కుములుతున్న వాళ్లకు నిముసమే యుగంగా కన్పిస్తుంది. రంగడికి తన రెండేళ్ళ శిక్ష ఒక మహాకల్పంగా గోచరించడంలో వింతలేదు. ఆ రోజు ఉదయం తలుపు తెరుస్తూ కాపలావాడు "నీ శిక్ష పూర్తైంది" అన్నాడు.

రంగడు మళ్లీ ప్రపంచంలో పడ్డాడు. మెల్లగా కాళ్లీడ్చుకుంటూ రైల్వేస్టేషను వరకూ నడిచాడు. అతడెక్కవలసిన రైలు అరగంట క్రితం వెళ్ళిపోయింది. మళ్లీ రాత్రి

పన్నెండుకు గాని బండి లేదు. రంగడు బానువైపు వారితీశాడు. త్రోవలో ఒక బంకుదగ్గర ఆగి బీడికట్ట కొనుక్కున్నాడు. కాలుతున్న టెంకాయ పురిలో ఒక బీడీ అంటించి ఎండిన అధరాలకు కొంచెం పదునెక్కించి ముందుకు నడవసాగేడు.

రంగడలా రెండు ఫర్లాంగుల దూరం నడిచి వుంటాడు. అక్కడొక చిన్న వీధి హైరోడ్డుతో కలుస్తుంది. రంగ డా వీధి మొగసాల్లో ఆగాడు. అతడక్కడ ఆగిపోవడానికి కారణం ఒక సినిమా బొమ్మ. ఆ బొమ్మలో ఒక కొమ్మ నడివీధిలో నవ్వుల జడివాన కురిపిస్తోంది. రంగడు గోడకి అతికించబడి వున్న ఆ బొమ్మని చూడ్డం హఠాత్తుగా తటస్థించింది. ఆ చూచిన క్షణాన రంగడి శరీరం కొయ్యబారిపోయింది. అతడు కొయ్యబొమ్మలా ఆ బొమ్మని చూస్తూ నిలుచుండి పోయాడు.

ఆ నవ్వు రంగడికి సుపరిచితం. ఆ నవ్వు రంగడి బీడు బ్రతుకుపైన తొలకరి వానలా కురిసింది. ఆ నవ్వుకోసం, ఆ అరుణరాగరంజితాలైన పెదవులపైనుంచీ వచ్చే ప్రియ వచనాలకోసం కాకపోతే రంగడు మరెందుకు బ్రతుకుతున్నాడు!

'బొంయ్, బొంయ్' మంటూ హైరోడ్డునుంచి వీధిలోకి మళ్ళిన కారుక్రింద పడబోయి వెంట్రుకవాసిలో తప్పించుకుని ముందుకు పరుగెత్తాడు రంగడు. ఆ ఆందోళనలో అతడికి వీధి మధ్యలోనుంచి వైదొలగి ఏ అరుగుమీదైనా నిల్చుంటే, మరి ప్రాణాపాయ ముండదని స్ఫురించలేదు. ఆ పరుగుతో అతడు వీధి చివరిదాకా వెళ్ళాడు. ఒగర్చుకుంటూ అక్కడ

ఆగి మళ్లీ గోడవైపు చూచాడు. అక్కడ మరో బొమ్మ కనిపించింది. బొమ్మ వేరైనా అందులోని బొమ్మ మాత్రం అదే! అదే యువతి మరో ఫోజులో! ఈ సారి ఆవిడ ఒక మగవాడితో జంటగా ఊయలూగుతోంది.

రంగడు గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. తన మనో వీధిలో పొడమిన అనుమానాంకురాన్ని సమూలంగా నాశనం చేయడానికి ప్రయత్నించాడు. ఈ విడ రమణి కాదు. కావడానికి వీల్లేదు. తన రమణి పరాయివాడితో బాటు ఊయల్లో కూచుని ఊగదు. తనెవతెనో చూచి రమణి అని భ్రమిస్తున్నాడు.

"తప్పుకో, తప్పుకో!" అంటూ పరుగెత్తి వస్తున్న రిక్షావాడి కేకవిని ఉలిక్కిపడి రంగడు మరికొంతదూరం నడిచాడు. అతడు నడుస్తున్న రోడ్డు అక్కడ మరొక రోడ్డుతో కలుస్తుంది. ఆ వీధి కెదురుగా రోడ్డు కటువైపున ఒక పెద్ద హోటలు, ఆ హోటలు పైన పెద్ద సైజులో ఒక సినిమా పోస్టరూ చూచి రంగడు మళ్లీ ఆగిపోయాడు. ఆ బొమ్మలో యిదివరకటి చిత్రాల్లోలా ఆ యువతి నవ్వడమూ లేదు, ఊయలూగడమూ లేదు. వీణ వాయిస్తోంది. అదే యువకుడు వెనుకనుంచీ ఆమె జడలో ఒక గులాబీ పువ్వు వుంచుతున్నాడు.

రంగడి హృదయవీణపైన ఎవరో చేయివేసి చరాలున తంత్రుల్ని తెంపివేసినట్టయింది. ఇందుగల దందులేదని ఎందూ కనిపిస్తున్న ఆ బొమ్మలబారినుంచీ తప్పించుకోడానికి అతడు

కాలికొద్దీ అటూ, ఇటూ పరుగుతీశాడు. ఎంతగా నిమ్మళ పరుకోబోయినా అతడి మనసు పట్టుసడలి మళ్లీ మళ్లీ అదే అనుమానానికి గురికాసాగింది. వేయిమందిలో వున్నా రమ ణిని తను గుర్తుపట్టగలడు. ఈ విడ రమణే! మరొకరైతే తన హృదయాని కింత అఘాతం కలిగివుండదు... కాదు. ఈవిడ రమణి కాదు. తను నేరస్థుడుగా యిల్లు విడిచిపెట్టిన తర్వాత రమణి దిక్కూ, మొక్కూ లేని ఏకాకి. ఆమె ఎక్కడో ఒకచోట చాకిరీచేసి పొట్టబోసుకుంటూ తన రాక కోసం ఎదురు తెన్నులు చూస్తుంటుంది. తారాపథంలో మిల మిల మెరసిపోతున్న యీవిడ, తన సంపర్కంవల్ల సుఖ శాంతుల్ని గోల్పోయిన అభాగ్యురాలు రమణి ఒక్కరే కావడం కల్ల!

రాత్రి ఎనిమిది గంటలు దాటి వుంటుంది. దూలాల్లా వూరిపోయి బరువెక్కిన కాళ్ళ నీడ్చుకుంటూ నడవలేక రం గడు ఒక చెట్టుక్రింద కూచున్నాడు. అక్కడే పడుకుని కాసేపు నిద్రపోతే ఎంత బాగుండు ననిపించిందతనికి. కానీ దౌర్భాగ్యు డెక్కడికి పోయినా దురదృష్టం వాడి వెన్నంటే వుంటుంది. అక్కడికి చేరువగా విద్యుద్దీపాల వెలుగులో ఒక సినిమా హాలు పూలతెప్పలా రంగడికి కనిపించింది. ఆరిపోతూ మళ్లీ వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బుల మధ్య రమణి ఆకారం అంతలో కనిపించి, అంతలో మాయమైపోతోంది. ఆ చిత్రం చూస్తూ, చూస్తూ రంగడు పైకి లేచాడు. లేచి పది అంగల్లో హాలు దగ్గరికి వెళ్ళి అర్ధరూపాయి కిటికీలో విసరి "టికెట్టు,

కాలికొద్దీ అటూ, ఇటూ పరుగుతీశాడు. ఎంతగా నిమ్మళ పరుకోబోయినా అతడి మనసు పట్టుసడలి మళ్లీ మళ్లీ అదే అనుమానానికి గురికాసాగింది. వేయిమందిలో వున్నా రమ ణిని తను గుర్తుపట్టగలడు. ఈ విడ రమణే! మరొకరైతే తన హృదయాని కింత అఘాతం కలిగివుండదు...కాదు. ఈవిడ రమణి కాదు. తను నేరస్థుడుగా యిల్లు విడిచిపెట్టిన తర్వాత రమణి దిక్కూ, మొక్కూ లేని ఏకాకి. ఆమె ఎక్కడో ఒకచోట చాకిరీచేసి పొట్టబోసుకుంటూ తన రాక కోసం ఎదురు తెన్నులు చూస్తుంటుంది. తారాపథంలో మిల మిల మెరసిపోతున్న యీవిడ, తన సంపర్కంవల్ల సుఖ శాంతుల్ని గోల్పోయిన అభాగ్యురాలు రమణి ఒకరే కావడం కల్ల!

రాత్రి ఎనిమిది గంటలు దాటి వుంటుంది. దూలాల్లా వూరిపోయి బరువెక్కిన కాళ్ళ నీడ్చుకుంటూ నడవలేక రం గడు ఒక చెట్టుక్రింద కూచున్నాడు. అక్కడే పడుకుని కాసేపు నిద్రపోతే ఎంత బాగుండు ననిపించిందతనికి. కానీ దౌర్భాగ్యు డెక్కడికి పోయినా దురదృష్టం వాడి వెన్నంటే వుంటుంది. అక్కడికి చేరువగా విద్యుద్దీపాల వెలుగులో ఒక సినిమా హాలు పూలతెప్పలా రంగడికి కనిపించింది. ఆరిపోతూ మళ్లీ వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బుల మధ్య రమణి ఆకారం అంతలో కనిపించి, అంతలో మాయమైపోతోంది. ఆ చిత్రం చూస్తూ, చూస్తూ రంగడు పైకి లేచాడు. లేచి పది అంగల్లో హాలు దగ్గరికి వెళ్ళి అర్ధరూపాయ కిటికీలో విసరి "టికెట్టు,

టికెట్టు'' అన్నాడు. ఎనిమిది గంటల వేళప్పుడు సినిమాకి బయల్దేరి వచ్చిన విచిత్ర వ్యక్తిని ఓరకంటితో చూస్తూ బుకింగ్ క్లర్కు ఒక నేలటికెట్టు చించి రంగడి చేతిలో వుంచాడు.

ఏ బలీయమైన ఆకర్షణలవల్లనైతే ప్రేక్షకులు ఆ చిత్రాన్ని విరగబడి చూచారో ఆ రసవత్తర ప్రణయ సన్నివేశాల్ని రంగడు అయిదారు నిమిషాలకంటే ఎక్కువసేపు చూడలేకపోయాడు. అతడు హాల్లో అడుగుబెట్టేసరికి వెండి తెరపైన నాయకీ నాయకుల మధ్య ఒక చిన్న ప్రణయకలహం సాగుతోంది. నాయకుడు ఆఫీసునుంచి తిరిగి రావడంలో కొంత విలంబనం జరిగింది. ఈ టీకప్పులో తుఫాను కిదీ కారణం. ఆమె ముఖాన్ని ముకుళితపద్మం చేసుకుంది. అతడు వెయ్యి విధాల బుజ్జగించాడు. కడకు కాఫీ టంబ్లరు ఆమె పెదవుల కందిస్తూ "నువ్వు నా రాణీవైతే యీ కాఫీ కళ్ళు మూసుకుని త్రాగేయాలి'' అన్నాడు. త్రాగకపోతే నువ్వు నా రాణీవు కావు పొమ్మంటాడని భయమేమో, ఆవిడ నాలుగు గ్రుక్కల్లో కాఫీ పూర్తి చేసి "చూచారా! నేను మీ రాణీనే!'' అన్నట్టు భర్తవైపు ఓరకంటితో చూచింది. ప్రేక్షకులు ఆ శృంగార ఘట్టాన్ని అప్రీసియేట్ చేస్తూ చప్పట్లు చరిచారు. ఆ కరతాళాలు రంగడి తలపైన సమ్మెట ప్రేటుల్లా మారుమ్రోగాయి. ఇంతలో నాయకి మళ్లీ ఒక ప్రత్యేక ప్రణయ పారవశ్యాన్ని అభినయించింది. ఉన్నట్టుండి ఆవిడ భర్తవైపు తిరిగి "చూడండి, ఆలస్యంగా వచ్చినందుకు మిమ్మల్నేం చేస్తానో!'' అంటూ అతడి రొమ్ముపైన రెండు

చేతుల్తోనూ గుద్దులు కురిపింపసాగింది. ప్రియురాండ్ల పాద తాడనాల్ని సైతం సైరించిన కథానాయకుల కోవకు చెందిన వాడేమో, అతడు పెద్దపెట్టున నవ్వసాగేడు. అతడితో బాటు ప్రేక్షకులూ నవ్వారు. ఆ నవ్వుల సుడిగాలిలో రంగడి హృదయం శుష్కపత్రంలా గిరవాట్లు కొట్టింది. అతడికి లోకు లందరూ ఒక్కుమ్మడిగా తనని అవహేళన చేస్తున్నట్టు తోచింది. నవ్వుతున్న ప్రేక్షకసమూహాన్ని చురచురచూస్తూ అతడు ఎలుగెత్తి "ఆపండి, ఆపండి" అని కేక వేశాడు. ఒక క్షణంపాటు అక్కడ కూచున్నవాళ్ళ కళ్ళన్నీ రంగడి వైపు తిరిగాయి. ఆ చూపులు రంగణ్ణి యిట్టే పిచ్చివాడుగా తేల్చివేశాయి. వస్తాదుల్లాంటి వాళ్ళిద్దరు పైకి లేచి రంగణ్ణి బయటికి లాక్కొచ్చి సింహద్వారం చూపించారు.

గమ్యస్థానమంటూ లేక రంగడు వీధుల్లో తిరుగ సాగేడు. పదిగంటలకు సినిమానుంచీ యిళ్ళకు వెళ్తున్న వారి తోనూ, రెండో ఆటకు పోతున్నవారితోనూ వీధుల్లో మళ్ళీ రద్దీ ఎక్కువైంది. ఆ జనసమూహం మధ్య నడుస్తున్న రంగ డికి, అతడి కవసరమైన భోగట్టా కొంత లభించింది. ఎవరో యిద్దరు ముగ్గురు చిత్రం బాగోగుల్ని గురించి మాట్లాడు తుండగా నాయకి నటనకి సంబంధించిన ప్రస్తావన వచ్చింది. తరువాత చర్చ నాయకి వ్యక్తిగత జీవితంవైపు మళ్ళింది. అదృష్టం అంటే అలా వుండాలట! ఎక్కడో నాటకాలాడు కుంటున్న మనిషి ఎవడినో లేవదీసుకుని వెళ్ళిపోయింది. వాడిది కాపురంచేసి ఏడ్చే మొహం కాదు. ఆవిడని నట్టేటిలో పుట్టిలా

విడిచి వా డెక్కడికో వెళ్ళిపోయాడు. ఎవ రెవరి నోము ఎప్పుడు పండుతుందో ఎవరు చెప్పగలరు? ఆమె కెలాగో సినిమా వాళ్ల ప్రాపకం దొరికింది. అవకాశం దొరకడ మేమిటి, చిటారు కొమ్మలో మిఠాయి పొట్లంలా వెలిగిపోవడ మేమిటి, ఒక్కసారిగా జరిగాయి.

రంగడి అనుమానం కాస్తా బలపడింది. పూర్తిగా బలపడిందని చెప్పవచ్చు కూడా! కానీ రంగడి కప్పటికీ ఒక సందేహం వుండిపోయింది. తన చెవులూ, కళ్ళే తనని మోస గిస్తున్నా యేమో!

పదినిమిషాల తర్వాత రంగడు తల పైకెత్తి చూశాడు. ఎదుట రైల్వేస్టేషను కనిపించింది. ప్లాట్‌ఫారం దగ్గర పొగ విడుస్తూ రైలు నిలబడి వుంది. తలుపు తెరచి రంగడు బండిలో అడుగు బెట్టాడో లేదో, అతడికోసమే అక్కడికి వచ్చి, అత డెక్కగానే ఇంక తనకక్కడ పని తీరిపోయినట్టు రైలు కదిలింది.

*   *   *

పత్రికల్లో ఒక వార్త పడింది. చిత్రమైన వార్త. పువ్వుల అంచులకు మధ్య 'తారకాసురుడు' అన్న శీర్షిక క్రింద వార్త ప్రచురింపబడింది. "ఊరూ, పేరూ లేని దేశ ద్రిమ్మరి ఒకడు ఒక ప్రఖ్యాత సినిమాతార యిల్లెక్కడో వాకబు చేసుకుంటూ పట్టణంలో తిరుగుతున్నాడు. వాలకం చూస్తే నాలుగేళ్లు ముక్కు మూసుకుని హఠయోగం చేసిన బైరాగిలా కనిపిస్తున్నాడు. సదరు సినిమాతార నొక్కసారి

చూడ్డం తప్ప తన కెలాంటి దురుద్దేశమూ లేదని అతడు చెప్పు కుంటున్నాడు."

ఈ వార్త ప్రచారితం అవుతుండగానే ఆ సినీతార యింటిముందు ఓ సంఘటన జరిగింది.

రెండతస్థులమేడ ప్రక్కనుంచీ రోడ్డువరకూ వ్యాపించి వున్న పూలతోటకు మొదట వేపచెట్టుక్రింద సుఖాసీనుడయ్యే ఘూర్ఖావాడి కథనం ప్రకారం, ఒకరోజు ఉదయం ఆ సినీనటి కోసం వచ్చినవాడొక 'దోవపోకిరి.' ఘూర్ఖా వాడెక్కడ పుట్టి ఎక్కడ పెరిగాడో ఎవరికీ తెలియదు. అతడికి తెలుగు, అరవం, ఇంగ్లీషు భాషల్లో ఏదీ రాదు. రావాల్సిన అవసరం కూడా లేదు. అతడిపని గేటు దగ్గరికి వచ్చిన వాళ్ళని వెళ్ళి పొమ్మనడం. ఆ వెళ్ళిపొమ్మనడానికి కావలసిన పదాలన్నీ అతడికి క్షుణ్ణంగా తెలుసు.

రూక్షవీక్షణాలు, కర్కశ కంఠస్వరమూ ఘూర్ఖావాడి సొత్తులని రంగడికి తెలియదు. అతడికి తెలిసిందల్లా ఆ ఘూర్ఖా వాడు కూడా తనలాటి మానవుడేనని. ఆ నమ్మకంతోనే అతడు ఘూర్ఖాని సమీపించాడు.

"ఎవరు నువ్ ? ఏం కావాలి ?" అన్నాడు ఘూర్ఖా వాడు.

రంగడికి భయంవేసింది. ఐనా చల్లకు వచ్చి ముంత దాచినందువల్ల లాభం లేదు. అతడు జేబులోనుంచీ నాలుగు

బీడీలు తీసి ఘూర్ఖావాడి చేతిలో వుంచబోతూ "మరే మనకో వద్దు బాబూ! నే నొకసారి లోపలికి వెళ్లాలి" అన్నాడు.

"లోపలికా వెళ్లాలా? అదే పైత్యం! పోడా దూరమా!" గర్జించాడు ఘూర్ఖా.

"ఒకటి రెండు నిమిషాల్లో పని చూచుకుని మళ్ళీ వచ్చేస్తాను బాబూ!" ప్రాధేయపడ్డాడు రంగడు.

ఘూర్ఖావాడి కళ్ళు చంద్రనిప్పుల్లా మెరిసాయి. అతడి చేయి తోలుపటకా పైకి పోయింది. అరక్షణంలో రంగడి కళ్ళముందు నాగుబాము పడగలాంటి తెల్లటి బిచువా మెరిసి పోసాగింది.

గుండె బేజారెత్తి రంగడు నాలుగుబారలు పరుగెత్తి ప్రాకారకుడ్యానికి ఆనుకున్నాడు. క్రిమినీ, కీటకాన్నీ చూచి నట్టు ఘూర్ఖావాడు రంగణ్ణి చూడసాగేడు.

రంగడు ఘూర్ఖాని కాస్తా మెత్తపరచడానికి సాధ నాంతరాలు అన్వేషింపసాగాడు. తన దగ్గర డబ్బు లేదు. ఉంటే, ఉన్న డబ్బంతా వాడి పాదాలముందు పోయడానికి తను వెనుకదీయడు. ఐనా ధోరణి చూస్తుంటే వీడు డబ్బుకు పాలుమాలేవాడులా కనిపించడం లేదు. బ్రతిమాలుకుందా మంటేనా, దగ్గరికి వెళ్ళేసరికే మండిపడుతున్నాడు. ఇంక ఏం చేయాలి?...రంగడు ప్రాకారంవైపు చూచాడు. ఊహు, లాభం లేదు. గోడ ఎత్తుగా వుండడం మాత్రమే గాదు, పైన దట్టంగా గాజుపెంకులు కూడా వున్నాయి.

రోడ్డుపైన వెళ్తున్న కారొకటి వున్నట్టుండి, బంగళా వైపు తిరగడంతో రంగడి ఆలోచనలకు బ్రేక్ పడింది. కారు శరవేగంతో ముందుకు వస్తోంది. రంగడు ఒకడుగు ముందుకు వేశాడు. అతడొకటి రెండు క్షణాలకన్నా ఎక్కువసేపు కారు లోపలికి చూచి వుండడు. ఐనా తన రమణిని పోల్చుకోడాని కెంతసేపు కావాలి! అతడా నిమిషాన తనకీ, రమణికీ వున్న అంతరాంతరాల్ని మరచిపోయి "రమణీ, రమణీ!" అంటూ ముందుకు పరుగెత్తాడు.

మేడ ముందు ఆగిన కారునుంచి క్రిందికి దిగుతూ రమణి డ్రయివరుతో "గేటు దగ్గర ఎవరో కారు వెంబడి పరుగెత్తి వచ్చినట్టుంది కదూ!" అంది.

"అలాగాండీ! నేను చూడలేదు" అన్నాడు డ్రైవరు.

"నువ్వు కారుని షెడ్‌లోకి తీసుకెళ్ళు" అంటూ రమణి వెనుదిరిగి గేటుదాకా నడిచింది. ఘుర్ఖావాడు లేచి నిలబడి సెల్యూట్ చేశాడు.

"ఎవడా మనిషి? ఎలా వెళ్ళిపోయాడు?" అంది రమణి.

"వాడాండీ! ఒరు వేగబాండ్! ఇంక చస్తే యింద పక్కరాడు—పోలీసు పట్టుకెళ్ళారు"

రమణి తలవంచుకుని మళ్లీ మేడవైపు నడవసాగింది, మధ్యలో వజ్రపాణి ఎదురై "ఎక్కడికి వెళ్ళావు రమణీ ఎండలో" అన్నాడు.

“ అబ్బే, ఎక్కడికీ లేదు. ఆ పొదరింట్లో కాసేపు కూచుందామని ” అంది రమణి.

“ ఐతే పొదరింటికి వెళ్ళవలసిన దారి యిది కాదు. అది ” అంటూ నవ్వాడు వజ్రపాణి.

రమణిలో అప్పుడప్పుడూ పరధ్యానం శృతిమించి రాగాన పడుతుండడం వజ్రపాణి గమనించకపోలేదు. ఆ పర ధ్యానానికి మూలకారణ మేదో అతడికి తెలుసు. ఎంతగొప్ప అంతస్థు అందుకోగలిగినప్పటికీ, ఒకొక్కప్పుడు మానవుల దృష్టి అధోలోకాలవైపు ప్రసరిస్తుంటుం దెందుకా అని వజ్ర పాణి రమణి పరధ్యానంగా వున్నప్పుడల్లా తర్కించు కుంటాడు.

రమణిని చిత్రరంగంలో ప్రవేశపెడుతూ వజ్రపాణి ఆమెపైన గొప్ప ఆశలేవీ వుంచుకోలేదు. ఉదరపోషణ కామె కొక వెరవు చూపించినందుకు అతడికి సంతృప్తి కలిగినమాట మాత్రం నిజమే! కాదంటే ఆ సంతృప్తితోబాటూ తనలో పరోపకార పారీణత లేకపోలేదనే విశ్వాసం సైతం అతడికి కలిగింది. కాని రమణిపట్ల అతడు వేసుకున్నా అంచనా కొద్ది కాలంలోనే తారుమారయింది. ఆమెలో వృద్ధికిరాగల లక్షణాలు చూడనేర్పినవారి కళ్ళకు గోచరించాయి. వాళ్లు మట్టినుంచి మణుల్ని పైకితీసే యింద్రజాలాన్ని వజ్రపాణికి అంటగట్టి అతణ్ణి నేలపైనుంచీ నాలుగుబారలు పైకెత్తేశారు. అప్పటినుంచీ వజ్రపాణికి రమణిపైన శ్రద్ధ ఇనుమడింపసాగింది.

ఆమెని పైకి తీసుకురావడంకోసం ఆలోచించడం అతడి నిత్య కృత్యాలలో ఒకటై కూర్చుంది.

ఆరునెలల క్రిందటి సంగతి. అప్పుడప్పుడే రమణికి చిత్రరంగంలో ప్రాబల్యం కలుగుతోంది. షూటింగులతో ఆమెకి రేయింబవళ్ళూ తెమలడంలేదు. ఓరోజున ఉదయం వజ్రపాణి ఆమెని ఔట్‌డోర్ షూటింగుకని బయలుదేర దీస్తుండగా, పోస్టుమెన్ ఆమెకో ఉత్తరం తెచ్చాడు. రెండు వారాలకుముందు పెట్టెలో పడిన ఆ వుత్తరం రమణిని అన్వేషిస్తూ దేశమంతా ఒక ప్రదక్షిణం చేసుకుని వచ్చింది. వజ్రపాణే వుత్తరం చించి చదివాడు. రంగడు చావుబ్రతుకుల మధ్య వున్నాడనీ ఆత్మీయులెవరైనా వుంటే వచ్చి చూచి పోవచ్చుననీ జైలు అధికారులు వ్రాశారు.

"ప్రోగ్రాం కాన్సిల్ చేయించండి. నేనక్కడికి వెళ్ళి రావాలి" అంది రమణి.

వజ్రపాణికి చిర్రెత్తుకొచ్చింది. పెద్ద ఎత్తున ప్రారంభమైన షూటింగులు వదలిపెట్టి ఆ రంగణ్ణి చూచిరావాలని చెప్పడానికి రమణికెలా నోరాడిందో అతడికి అర్థం కాలేదు,

"మీకేనండీ చెప్పడం! నా కెలాగైనా నాలుగు రోజులు శెలవిప్పించండి" అంది మళ్ళీ రమణి.

వజ్రపాణి రమణి ముఖంలోకి చూచాడు. ఆవిడ నిశ్చితాభిప్రాయం అతడికి అవగతమైంది. అదికాస్తా అవగత కావడంతో అతడు తన ధోరణి మార్చుకుని "చూడు రమణి

రంగడు నా తమ్ముడు. వాడిపైన నీ కెంత అక్కఱుందో నాకూ అంత అక్కఱుంది. ఇక్కడ కొన్ని వేల రూపాయలు నష్టపరిచి నువ్వు వాడిని చూచి వచ్చినందువల్ల ఒరగబోయే దేముంది? నీ బదులు నేను వెళ్ళొస్తాను. వీలుంటే అధికారులతో మాట్లాడి అతణ్ణి తీసుకొచ్చేస్తానుకూడా! సరేనా" అన్నాడు,

రమణి కొంతసేపు ఆలోచించి సరేనంది.

తన జీవితంలో బొత్తిగా తనకిష్టంలేని పనేదైనా వజ్రపాణి చేసివుంటే అది రంగణ్ణి చూడ్డానికి వెళ్ళడం, తీరా అతడు వెళ్ళేసరికి రంగడు స్మారకం తప్పి మంచంపైన పడి వున్నాడు.

"రోగి పరిస్థితి ఎలా వుందండీ?" అని వజ్రపాణి నర్సుని అడిగాడు.

"అబ్బే, ఏం బాగుండలేదండీ! ఇలాటి కేసులు నేను చూచాను. నూటి కొకరిద్దరు బ్రతికితే హెచ్చు" అంది నర్సు.

వజ్రపాణి డాక్టరు దగ్గరికి వెళ్ళి మళ్ళీ అదే ప్రశ్న వేశాడు. "గోడమీద పిల్లి వాటంగా వుంది కేసు. ఇటూ చెప్పలేము, అటూ చెప్పలేము. మొత్తంమీద పరిస్థితి ప్రమాదకరమే" అన్నాడు డాక్టరు.

"ఇటువంటి కేసుల్లో ఒకటి రెండుకంటే ఎక్కువ నయం కావంటారండీ! మీకు తెలియని విషయం గనుకనా!" అన్నాడు వజ్రపాణి.

"ఎవరా మాట చెప్పింది?" డాక్టరు కొంచెం గట్టిగా ప్రశ్నించాడు.

"ఆవిడేనండీ! ఆ లావుపాటి నర్సు" అన్నాడు వజ్రపాణి.

"నూటికి పది పదిహేను కేసులు కూడా నయమౌతాయి. ఆవిడకి తెలియదు" అన్నాడు డాక్టరు.

ఎందుకోగాని వజ్రపాణికి డాక్టరుకంటే నర్సే అనుభవజ్ఞురాల్లా కనిపించింది. పోనీ డాక్టరు అభిప్రాయాన్నిబట్టి చూచినా రంగడు మామూలు మనిషి కాగలడనడానికి అట్టే అవకాశం కనిపించడం లేదు. పది పదిహేను మందిలో కన్నా ఎనభై ఎనభై అయిదు మందిలో రంగణ్ణి కలిపివేయడం వజ్రపాణికి సమంజసంగా తోచింది.

ఆ రోజు సాయంత్రమే వజ్రపాణి పట్నానికి తిరిగి వచ్చాడు. ముఖం చిన్నబుచ్చుకుని "మనకి రంగడు లేడు రమణీ!" అని చావు కబురు చల్లగా చెప్పేశాడు. రంగడెలాగా పదిరోజుల్లో చనిపోబోతున్నాడు గనుక యీ అబద్ధం చెప్పడం మరేమంత కొంప మునిగిపోయే అపరాధం కాదని కూడా వజ్రపాణి తన అంతరాత్మకి నచ్చజెప్పుతున్నాడు.

*　　　*　　　*

ఉన్నట్టుండి ఆశ్లేషాపిక్చర్స్ వాళ్లకి బిచ్చగాళ్ళు కావలసివచ్చారు. వాళ్ళ కప్పుడప్పుడూ రాజులు కూడా కావలసివస్తారు. కానీ రాజులతో వాళ్ళ కట్టే చిక్కుండదు.

మెడకాయమీద తలకాయవున్న సాధారణ మనిషి కెవడికైనా సరే చెమ్కీ గుడ్డలు తొడిగి, గాజుపూసల దండలు రెండు వేసి, వల్లెవాటు గిరజాలు కైసేసి రాజుగా నిలబెట్టగల సామర్థ్యం వాళ్లకుంది. బిచ్చగాళ్ల కలాంటి అలంకారాలు పనికిరావు. వీళ్లైనంత మాసి, చినిగిన దుస్తుల్లో బాగా వికారంగా కనిపిస్తే తప్ప వీడు బిచ్చగాడేనని ప్రేక్షకులు నమ్మరు. ప్రేక్షకులు సామాన్యంగా సంశయాత్ములు.

ఐనా ఒకరిద్దరు బిచ్చగాళ్ళని తయారుచేయడం ఆశ్లేషా పిక్చర్స్ వారికేమంత కష్టమైన పనిగాదు. గేట్‌కీపరు నుంచీ కథానాయకి వేలువిడిచిన తమ్ముడు వరకూ ఎవరో ఒకరు బొచ్చె చేతబట్టుకుని అపర బిచ్చగాళ్ళలా సాక్షాత్కరించి అవసరం గడుపుకోడానికి ఉపకరిస్తుంటారు. కానీ వచ్చిన చిక్కల్లా ఏమిటంటే ఆశ్లేషా పిక్చర్స్ వాళ్ళకి దాదాపు నూరుమంది బిచ్చగాళ్లు కావలసి వచ్చారు. అందులోనూ వాళ్లందరూ నిజమైన బిచ్చగాళ్ళే అయితే ఆ ఘట్టములో సహజత్వం ఉట్టిపడగలదని విజ్ఞులు కొందరు సలహాయిచ్చారు.

నిర్మాత డైరెక్టర్ ముఖం చూచాడు. డైరెక్టర్ ప్రొడక్షన్ మేనేజర్ ముఖం చూచాడు. ప్రొడక్షన్ మేనేజర్ పేవ్‌మెంట్ల వెంబడే పరుగులు తీశాడు. మరునాటి ఉదయం తెల్లవారేసరికి రెండు లారీల నిండుగా బిచ్చగాళ్లు హాజరు పరచబడ్డారు.

కలకలలాడుతున్న పూలతోట మధ్య రాజమహలు బిచ్చగాళ్లకు నేత్రపర్వంగా జనిపించింది.

"అబ్బబ్బ! ఏం మహాలు!! ఏం మహాలు!!!" అంటూ విస్తుపోయాడు ఒక అమాయకపు బిచ్చగాడు.

"గొప్ప మహాలే లే! వట్టి అట్టముక్కలు" అన్నాడొక తెలివైన బిచ్చగాడు.

"ఐతే యిదంతా పైకి పటారమే నన్నమాట!" అంటూ మరొకడు కిసుక్కున నవ్వాడు.

"ఇష్, మాట్లాడగూడదు. మీరందరూ ఒక్కొక్కరుగా యీ దారంట పైకి వెళ్లాలి. ఆ మలుపు తిరగ్గానే ఆర్చి దగ్గర మహారాణి నిలబడి వుంటుంది. ఆమె దగ్గర దానాలు పరిగ్రహించి అందరూ ఒక్కొక్కరుగా ఆ వైపునుంచే తిరిగి వచ్చేయాలి" అన్నాడు దర్శకుడు.

ఒక సందేహప్రాణి డైరెక్టరుకు అడ్డు తగిలి "ఐనా మహారాణిగారికి యీ రోజింత దయ కలగడానికి కారణమేమండీ?" అన్నాడు.

"ఓహో, అదా మీ సందేహం! అలా అడగాలి. మహారాజుగారు పొరుగు దేశంపైకి దండెత్తారు. యుద్ధం జరుగుతోంది. ఓహ్ భయంకరమైన యుద్ధం. రాజుగారి విజయాన్ని కోరుతూ మహారాణి బీదలకు దానధర్మాలు చేస్తోంది."

బిచ్చగాళ్ళు ఒక్కొక్కరే పైకి వెళ్ళి, అవతలి వైపు నుంచి క్రిందికి వచ్చేయసాగేరు.

"ఇంకా ఎందరున్నారండీ?" అన్నాడు కొంచెం విసుగుతో కెమెరామేన్.

"ఇదిగో కడపటివాడు" అన్నాడు డైరెక్టర్.

బిచ్చగాడు మహారాణి ముందు నిలబడ్డాడు. మహారాణి చెలికత్తె అందించిన నూత్న వస్త్రాల్ని చేతికి తీసుకుంది. బిచ్చగాడు చేతులు ముందుకు చాచాడు. మహారాణి బిచ్చగాణ్ణి జూచింది. బిచ్చగాడు మహారాణిని చూచాడు. బిచ్చగాడు "రమణీ! రమణీ!" అన్నాడు. మహారాణి "రంగా, రంగా!" అంటూ బిచ్చగాణ్ణి కౌగలించుకుంది.

కంగారుతో డైరెక్టర్ "కట్, కట్" అన్నాడు.